క్లుప్తంగా

శివాలయంలో రికార్డులు తనిఖీ



ఉయ్యూరు: మండల కేంద్రంలో వేంచేసి ఉన్న జగదాంబ సమేత సోమేశ్వరస్వామి (శివాలయం) లో దేవదాయశాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆర్‌జేసీ కె.సుబ్బారావు, డెప్యూటీ కమిషనర్ శోభారాణి ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన డిపాజిట్ల సొమ్ములో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ సుబ్బారావు మాట్లాడుతూ సోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 26 ఎకరాల్లో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణలో ఆరెకరాలు పోయిందన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం కింద రూ.8.36 కోట్లు రావటంతో ఆ మొత్తాన్ని డిపాజిట్ చేశామన్నారు. డిపాజిట్‌పై వచ్చే వడ్డీలో నిబంధనల ప్రకారం 2/3 వంతు దేవస్థానం ఖర్చులకు, 1/3వ వంతు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. డిపాజిట్ సొమ్ము భద్రంగా ఉందీ?, లేనిదీ?, డిపాజిట్ సమర్ధంగా చేస్తుందీ? లేనిదీ? పరిశీలించి దేవదాయశాఖకు నివేదిస్తామన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



కంకిపాడు: సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దాతలు పేర్కొన్నారు. మండలంలోని ఈడుపుగల్లు ఎంపీపీ మోడల్ పాఠశాలలో దేవినేని బాలగంగాధర్‌రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా శనివారం నోటు పుస్తకాలను అందించారు. ఈ పుస్తకాలను బాలగంగాధర్‌రావు మునిమనవరాళ్లు దీక్షిత సాయి, వరలక్ష్మి, రితికచౌదరి, వైష్ణవికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు రూపరాణి, మండవ శ్రీనివాస్, మీనాకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి



పెనమలూరు: ఉపాధ్యాయుల సమస్యలు ఎస్టీయు పరిష్కరిస్తుందని కృష్ణా జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు పి.ఇమ్మానుయేలు తెలిపారు. మండల పరిధిలో శనివారం తాడిగడప, కానూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో పాటు జీవో నెంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని, తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు సభ్యులు యు.టైటస్‌పాల్, పీవీ కృష్ణమోహన్, అబ్దుల్‌ఖలీల్, మీర్జా హసనైన్, వీజీ డేనియల్, ఎస్.సుధాకర్, జోసఫ్‌కుమార్, ఎం.మధుసూదనరావు పలువురు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



పాతపాడులో తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కంకిపాడులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు



వణుకూరులో తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాతపాడు(విజయవాడరూరల్): తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని పాతపాడు గ్రామ ఏఎన్‌ఎమ్ జి.నవత, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో తల్లిపాలపై అవగాహన కల్గించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి తల్లి బిడ్డకు తప్పనిసరిగా 6 నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు తాగడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. అదే విధంగా తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధి సోకకుండా ఉంటుందని పేర్కొన్నారు. పాలు ఇవ్వడంతో తల్లికి బిడ్డకు ప్రేమానురాగం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది.ఎంఎస్‌కె సజిని, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

వణుకూరులో తల్లి పాలపై అవగాహన

పెనమలూరు: వణుకూరు గ్రామంలో శనివారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన కలిగించారు. ఏఎన్ఎం వి.రష్మి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డ పుట్టిన వెంటనే పట్టించటం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు అందించే విధంగా తల్లి పాల వారోత్సవాలతో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జి.సునీత, అంగన్‌వాడీ కార్యకర్త బి.కాశీశ్వరిదేవి, ఆశ వర్కర్ సరళ తదితరులు పాల్గొన్నారు.



సూరంపల్లిలో తల్లిపాల గొప్పతనం గురించి వివరిస్తున్న టీచర్ కోటేశ్వరమ్మ, వైద్య సిబ్బంది

కంకిపాడు: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. కంకిపాడు లాకులు వద్ద శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పౌష్టికాహారం, తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తూ తల్లులు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఓ.మీనా, పి.మమత, ఆశ కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు. చలివేంద్రపాలెంలో తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.రమాదేవి, ఏఎన్ఎం జ్యోతి రాణి, ఆశ కార్యకర్త, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శనివారం ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. అదేవిధంగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.



పానుకుమాడులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవి

గన్నవరం రూరల్: తల్లి పాలు బిడ్డలకు శ్రేష్టమని ఐసీడీఎస్ సీనియర్ సూపర్‌వైజర్ నాగపద్మావతి చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం సూరంపల్లి గ్రామంలో తల్లులకు తల్లిపాల విశిష్టత ఆమె వివరించారు. అమ్మ పాలు బిడ్డకు వరం అని చెప్పారు. వీటిని మించిన పౌష్టికాహారం లేదన్నారు. అన్ని పోషకాలు బిడ్డకు అందించి రోగాల నుంచి రక్షించే అమృతమని చెప్పారు. అమ్మపాలు తాగే శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తిని బిడ్డ పొందుతుందని వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి 6 నెలల వరకూ తల్లిపాలు తప్ప మరేమీ ఇవ్వకూడదన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయని చెప్పారు. రోజులో బిడ్డకు 8నుండి 10సార్లు పాలు ఇవ్వాలన్నారు. పాలు ఇచ్చే సమయంలో తల్లి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బిడ్డను పడుకోబెట్టి, నిలబెట్టి పాలు పట్టకూడదని కూర్చొనే ఇవ్వాలన్నారు. వీటి ద్వారా తల్లీ బిడ్డల ఆరోగ్యం ఎంతో బాగుంటుందని చెప్పారు. ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మండవ కోటేశ్వరమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది, పలువురు సిస్టర్‌లు పాల్గొన్నారు.



వేలేరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి చెప్పారు. బాపులపాడు మండలంలోని వేలేరు, రేమల్లే, బొమ్ములూరు, మడిచర్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. రేమల్లేలో జరిగిన సదస్సులో పాల్గొన్న సూపర్‌వైజర్ ధనలక్ష్మీ మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, దీనిపై అపోహలను విడిచిపెట్టాలని చెప్పారు. బొమ్ములూరు, మడిచర్ల సర్పంచులు కాటూరు విజయభాస్కర్, అజ్మీరా శాంతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, అరుణలత, స్వాతి, సుజాత, దీనమ్మ, గుళ్లపూడి విజయలక్ష్మీ, చిమట హేమ నాగిని, మరియమ్మ, లక్ష్మీ, నవీన, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

పెనమలూరు: తాడిగడప గ్రామంలో పారిశుధ్య పనులను కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. గ్రామంలో ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి డ్రెయిన్ పూడిక తీయించారు. ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు పరిశీలించి సమయాలకు నీరు వదులుతుంది లేనిదీ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎల్‌వీ ప్రసాద్ రోడ్డులో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఆయిల్ బాల్స్ డ్రెయినేజీలో వేయించారు. మనోజ్‌నగర్‌లో మురుగునీరు పారుదల జరగటం లేదని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు పరిశీలించారు. పెదపులిపాక రోడ్డులో రోడ్డు పక్కనే వేసిన చెత్త కుప్పలను పొక్లెయిన్‌తో తీయించారు. గ్రామ ప్రజలు పారిశుధ్యం విషయంలో తమతో పూర్తిగా సహకరించాలని కోరారు.



పొక్లెయిన్‌తో చెట్ల కొమ్మలు ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

ఐసిటీ అకాడమీతో వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఒప్పందం

నున్న(విజయవాడరూరల్): ఎంతో ప్రాముఖ్యమైన ఐసిటీ అకాడమీతో తమ విద్యా సంస్థ ఒప్పందం కుదుర్చుకోవడం వలన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని వికాస్ విద్యాసంస్థల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం నున్న గ్రామంలోని వికాస్ కళాశాలలో ఐసిటి ఏపీ అధినేత దినకర్‌రెడ్డి, వికాస్ విద్యా సంస్థల ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ఐసిటి అకాడమీతో ఒప్పందం చేసుకోవడం వలన వికాస్ ఇంజినీరింగ్ కాలేజిలో ఇంజినీరింగ్ చేసిన విద్యార్థులకు ఉచితంగా వివిధ రకాలు కంప్యూటర్ కోర్సులు నేర్పిస్తామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ లాంటి ప్రస్తుత డిమాండ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం ఇంటారాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తి రెడ్డి పాల్గొన్నారు.



అకాడమీ అధినేత దినకర్ రెడ్డితో ఒప్పందం చేసుకుంటున్న నరెడ్ల నర్సిరెడ్డి

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి

రామవరప్పాడు: పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయు జిల్లా నాయకులు ఎం. సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సమావేశం నిర్వహించి పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ రామవరప్పాడు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య టెండర్ల విషయంలో కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులుగా సీఐటీయు మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా సీతారామరాజు, కార్యదర్శిగా వీరమ్మ, కమిటీ సభ్యులుగా రాధ, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. వేతన సమస్య పరిష్కరించకుంటే సమ్మెకు దిగి ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ సమావేశంలో తీర్మానించారు.



పంచాయతీ వర్కర్లు

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

రామవరప్పాడు: పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ శివప్రసాద్ యాదవ్ నిడమానూరు పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్‌కు సూచించారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో శనివారం పారిశుధ్య నిర్వహణ తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన గ్రామంతో పాటు నెహ్రూనగర్, రామానగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులపై ఆరా తీశారు. శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులు, ప్రధాన గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అలాగే సమస్యాత్మకంగా మారిన డ్రెయినేజీలను గుర్తించి పూడిక తీయించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి ప్రకాష్‌నాథ్ డీపీవోకు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: గోసాల గ్రామం వైకుంఠపురంలో ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. సాక్షిలో శనివారం ప్రచురించిన కాలువ కట్టలే ..వారికి నోట్ల కట్టలు కథనం పై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆక్రమణలకు రంగం సిద్ధం చేసుకున్న ఇరిగేషన్ కలువ కట్ట స్థలాన్ని పరిశీలించారు. శ్రీనివాసరావు ఇరిగేషన్ అధికారులను పిలిపించి స్థలంలో ఉన్న హద్దు కర్రలు, హద్దుల్లో కట్టిన పరదాలు వెంటనే తొలగించాలన్నారు. ఇరిగేషన్ స్థలమని బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కేసులు పెడతామని చెప్పారు. బందరు కాలువ కట్ట పటిష్టంగా ఉండాలని, కాలువ కట్టలు తెగితే ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కాలువ కట్టలు ఆక్రమించటం వలన దిగువ ప్రాంతాల్లో రైతులకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. డీటీ భరద్వాజ్, సర్వేయర్ శివరామకృష్ణ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

గంగూరు హోటల్‌లో వ్యక్తి పై దాడి

పెనమలూరు: గంగూరు హోటల్‌లో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గోసాలకు చెందిన వీరవెంకటమోహన్, ఆయన మిత్రుడు వేణు హోటల్‌కు వచ్చారు. వీరవెంకటమోహన్ మరో మిత్రుడు శ్రావణ్‌కుమార్‌ను రమ్మని పిలిచాడు. భోజనం చేస్తున్న సమయంలో వీరవెంకటమోహన్‌కు శ్రావణ్‌కుమార్‌కు మధ్య మాటామాటా పెరిగి గొడవ మొదలయింది. దీంతో శ్రావణ్‌కుమార్ రాడ్‌తో వీరవెంకటమోహన్ పై దాడి చేయడంతో గాయమయింది. బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పార్వతీ అమ్మవారికి శాకంబరి అలంకరణ

పెనమలూరు: కానూరులో వేంచేసి ఉన్న గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం శాకంబరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనాయ స్తోత్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అన్నే సుజాతతో పాటు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి బదిలీ

గన్నవరం: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసుబాబు బదిలీ అయ్యారు. ఆయనను చిత్తూరు జిల్లా మదనపల్లి ప్రిన్సిపాల్ సివిల్ కోర్టు జడ్జిగా నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మదనపల్లి ప్రిన్సిపాల్ సివిల్ కోర్టు జడ్జిగా పని చేస్తున్న బి.శిరీషను నియమించారు. గతంలో ఆమె సుమారు రెండేళ్ల గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు జడ్జిగా పనిచేశారు.

రైతులు సమగ్ర ఎరువుల పోషణ పాటించాలి

పెనమలూరు: మండల పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సమగ్ర ఎరువుల పోషణ పాటించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. ఆమె శనివారం రైతులకు ఎరువుల పోషణపై అవగాహన కల్పించారు. ఏవో శైలజ వివరాలు తెలుపుతూ 5500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులు రసాయన ఎరువులు 60 శాతం, సేంద్రీయ ఎరువులు 20 శాతం, జీవన ఎరువులు 20 శాతం వేయాలన్నారు. ఇలా వాడటం వలన ఫాస్పేట్ సోలిబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్‌బీ) దెబ్బ తినకుండా చూడవచ్చని వివరించారు. సీజన్‌లో రసాయన ఎరువులు మూడు దఫాలుగా వాడాలని సూచించారు. ఎంటీయు 1318 రకం వరికి ఎకరాకి యూరియా 80 కేజీలు, సూపర్ 100 కేజీలు, పొటాష్ 25 కేజీలు చొప్పున వేయాలన్నారు. సూపర్ వేయని పక్షంలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచించారు. యూరియా ఎక్కువగా వాడితే చీడపీడలు ఆశించి నష్టం కలిగిస్తుందన్నారు. యూరియా వరి నాటిన మొదటి 20 రోజుల్లో ఎకరాకు 30 కేజీలు, దుబ్బు దశలో 30 కేజీలు, పొట్ట దశలో 20 కేజీల చొప్పున వాడాలన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: వరి నారుమడి సాగులో సరైన మెలకువలు పాటించినప్పుడే అధిక పంట దిగుబడి సాధించగలమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.పద్మావతి అన్నారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.పార్థసారథి హాజరయ్యారు. వరి నారుమడిలో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. ఏవో భవాని, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలి

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం వైస్ ఎంపీపీ–1 కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీటీసీల గౌరవ వేతనానికి సంబంధించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. వైస్ ఎంపీపీ–2 కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీఓ సత్యకుమార్ పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాలు సేకరణ

పెనమలూరు: కేరళ వరద బాధితుల కోసం పోరంకిలో సీపీఎం నేతలు శనివారం విరాళాలు సేకరించారు. మండల కార్యదర్శి త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు పోరంకి నుంచి తాడిగడప సెంటర్ వరకు విరాళాలు సేకరించామన్నారు. సాయం అందించి బాధితులను ఆదుకోవాలని కోరారు. షేక్.కాశిం, బాబు, భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అవయవదానంపై ఉన్న అపోహలను పక్కన పెట్టి విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా అన్నారు. ఈడుపుగల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవయవదానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అభిజిత్ సిన్హా మాట్లాడుతూ అవయవదానం చేయడం చాలా ఉత్తమమైన పని తెలిపారు. అవయవదానంపై ఉన్న అపోహలను పక్కన పెట్టి మరణం అనంతరం ప్రతి ఒక్కరూ అవయవదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. బ్యాంకు ఏజీఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావంతో పాటుగా అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కుర్చీలు, ఐరన్ బీరువాను పాఠశాలకు అందచేశారు. బ్యాంకు అధికారులతో పాటుగా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ పోరాటం గెలిచింది

కంకిపాడు: మూడు దశాబ్దాల ధర్మ పోరాటం విజయం సాధించిందని పలువురు వక్తలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ కంకిపాడులో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. వర్గీకరణ సాధనకు పాటుపడ్డ మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఈఎఫ్ నాయకులు కుంపటి రాజేంద్రప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు వి.దాసు, ప్రతినిధులు జె.బసయ్య, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని గ్రామస్తుల ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. 216 హెచ్ జాతీయ రహదారిపై మృతదేహంతో బైఠాయించి నిరసన తెలిపారు. దేవభక్తుల ఏసురత్నం (37) శుక్రవారం బైక్‌పై ఆర్సీఎం చర్చికి వెళుతుండగా వెనుక నుంచి వేగంతో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఏసురత్నం అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ప్రమాద ఘటనకు కారణమైన కారు టైర్ పంక్చర్ కావటంతో ఆగిపోయింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.